
# వెలగని దీపాలు




దేవరాజు ఓసింగల్ టీచర్!

ఆ సింగల్ టీచర్ సింగల్‌గా ప్రయాణం సాగించాడు. ఆరుమైళ్ళు ఆర్టీసీ బస్సు మీద అందులో సగం అందాల అర్ధాంగితో కలిసి కట్నంగా మామగారిచ్చిన సైకిలుమీద. ఆ మూడంకణాల పూరింటి ముందు ఆగాడు. ఆగిన సైకిలు మీదినుండి కిందికి దిగాడు. దిగి తలను వాటంగా వంచాడు. చూపుడు వేలిని నొసటికానించాడు. ఆ వేలితో పట్టిన చెమటను నేలపాలు చేశాడు– ఆ ప్రయత్నానికి నిట్టూర్పు వంతపాడుతుంటే!

ఊరి ముందర చింతతోపులో వెలిసిన ఆ మూడంకణాల పూరిల్లు ఆ ఊరి పాలిటికి ఒక పాఠశాల! దేవరాజు కంట పడీపడడంతోటే 'అద్దో ? అయ్యోరొచ్చేసినాడ్రే!' అని అరుస్తూ ఆ చింతచెట్ల నీడలో బిళ్ళంగోడి, తొక్కుడుబిళ్ళ, ఉప్పరపట్టి ఆట్లాడుకొంటున్న పిల్లలు పిల్లిని చూసిన ఎలుకలు బొరియల్లో దూరినట్లు బిల బిల ఆ పూరింట్లో జొరబడ్డారు.

ప్రతిదినం ఉదయం ఆరుమైళ్ళు సాయంత్రం ఆరు మైళ్ళు ప్రయాణం చేసి దేవరాజుకూ... మిట్టపల్లాల్లో ఎక్కెక్కిదిగి సైకిలుకు నడుములు విరిగాయి. నడుములు విరిగిన సైకిల్ని చింతచెట్టు బోదె ఆధారంగా నిలబెట్టాడు దేవరాజు. ఉసూరుమంటూ బడిలో అడుగుపెట్టపోయి అలానే నిలబడి పోయాడు.

"ఏంవయ్యోరా? నీకు తీరినపుడు నువ్వొస్తే ఎట్లా? పిల్లకాయ లేఁవో ఇట్ల ఇంటితోడు, అట్లా దోవతోడు రొండు తప్పి సెడిపోతుండారు!" సద్దిదుత్త నెత్తిన బెట్టి మడి దగ్గరికి పోతూండిన లక్ష్మమ్మ అదే పనిగ నిలబడింది. దేవరాజును కొరకొరచూస్తూ చురచుర రెండు అంటించింది. దేవరాజు తల వంచుకొన్నాడు.

"అదిగాదు లచ్చుఁవక్కా! అయ్యోరు మాత్రఁవేం జేస్తాడు? ఆ ఆర్టీసీ బస్సులు యాళకేడ్సి సస్తేగదా? అవెప్పు డొస్తాయో? ఎప్పుడు పోతాయో? వాటికే తెలవకపాయ!........ వాటికంటే నోరులేని గొడ్ల మేపుకుండే నేనే మేలుగదా?" అయ్యవారికి మద్దతు పలికాడు ఆవుల్ని మేతకు తోలుకొని పోతూండిన యంగంపల్లి బోడెబ్బ!

బోడెబ్బ వైపు సాదరంగా చూశాడు దేవరాజు!– 'ఆలకాపరివి. నీ కయినా ఆ మాత్రం సానుభూతి ఉంది నా మీద!' చూపులతోనే దేవరాజు బోడెబ్బను పరామర్శించాడు.

"అవునవును. అదీ నిజవేఁలే బోడెబ్బా! ఆ బస్సులేఁవో యాళకు రావు. ఈ పల్లె కొంపలో అయ్యోరుండ్లేడు. ఈ పిల్లకాయల కింక వానాకాలం సదువే!" అని గొణుక్కొంటూ మిద్దింటి లక్ష్మమ్మ ముందుకు సాగింది.

పక్కన చేనిలో పడబోతూండిన 'దొంగగొడ్డు'ను అదిలిస్తూ బోడెబ్బ దాని వెంటపడ్డాడు. పాఠశాల అనబడే పూరింట్లో అడుగు పెట్టాడు దేవరాజు.

పిల్లలందరు లేచి నిలబడ్డారు– గురుభక్తికి చిహ్నంగా! గురుశిష్యులకు మధ్య ఉన్న ఆత్మీయుతానురాగాలు, కాలగమనంలో అడుగంటి పోతూంటే– ఈపద్ధతి మాత్రం కొనవూపిరితో ఉంది పల్లెల్లో! దేవరాజు తనకుర్చీలో తానుకూర్చుంటూ పిల్లల్ని కూర్చోమన్నాడు. పిల్లలందరు కూర్చున్నారు.

ఎదురెండ! మూడుమైళ్ళకు కాస్త అటో ఇటోగా బండిబాట! ముప్పయి మూడు సంవత్సరాల స్వపరిపాలనలో మన ప్రజాప్రతినిధుల సేవాపరాయణతకు నిదర్శనంగా నిలబడిన ఆ బాట– మూరెడు దూరం బాగుంటే బారెడు దూరం మోకాటిలోతు మిట్టపల్లాలతో ముండ్ల పొదలతో నిండి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా ఉంది. బాగున్న చోట సైకిలెక్కి తొక్కుతూ వీలుకాని చోట దిగి నడుస్తూ ఆ మూడు మైళ్ళు తన సైకిలు ప్రయాణం తలచుకొంటే మాటి మాటికి ఏదో ఒక తప్పు చేస్తూ, చేసిన తప్పుకు ఫలితంగా గుంజిళ్ళు పెట్టే ఓ పోకిరి విద్యార్థి మనసులో మెదిలి తనలో తాను నవ్వుకున్నాడు దేవరాజు!

బడిపంతుళ్ళ జీవితాలలో నిద్రలేచే వేళలు అసలు బాగుండవు. ఆ రోజు మరీ బాగలేదు. లేకుంటే– తానప్పుడే రావాలా? పడక పడక మిద్దింటి లక్ష్మమ్మ కండ్లల్లోనే పడాలా? ఆ ఇల్లాలు

ఉసూరుమంటూ అటుయిటు చూడకుండా మెత్తగా రెండంటించాలా? గ్రహచారం కాకపోతే- ఇదంతా ఏమి? దేవరాజు మనసుకు మాటలు వస్తే తనలో తాను గొణుక్కునింది!

ఎండవేడి!... మిద్దింటి లక్ష్మమ్మ మాటల్లో వాడి!!- దేవరాజు నోరు పిడచగట్టుక పోతూంది. గుక్కెడు నీళ్ళు గొంతులో పోసుకోవాలనిపించింది.

అది విద్యాలయం!... భావి భారత పౌరుల్ని తీర్చి దిద్దగల దేవాలయం! ఆ దేవాలయంలో గోడలమీద దేశనాయకుల పటాలుండేవి. తలుపులు ద్వారబంధాలు కూడ నోచుకోని ఆ పూరింట్లో దేశనాయకుల్ని ఎవరైనా దోచుకొనిపోతారని 'సర్పంచ్' జాగ్రత్తపడ్డాడు. దేశనాయకులు ఆయనింట చేరారు. ఆ తరువాత 'సర్పంచ్' గారి కుటుంబం వేర్లుపోయింది. దేశ నాయకులు కూడా వేర్లు పోయారు. ఇకపోతే రాత్రిపూట ఆ బడి యువతరానికి వినోద కేంద్రంగా... మారుతుంది. ఈతాకు చాపలు పరిపిస్తారు. 'పెట్రమాక్స్‌లైట్లు' పెట్టుకొంటారు. అర్ధరాత్రి దాటినా 'ఇస్పేట్' ఆకులాట ఆడుతుంటారు. ఉదయాన ఊడిపిస్తే బీడీ సిగరెట్టు ముక్కలు ఓ బుట్టెడుంటాయి! అయినా తనకు అడిగే తాహతు లేదు. అడ్డుకొనే శక్తి అసలే లేదు! తాను కేవలం ఒక సింగల్ టీచర్!

తానొక సింగల్ టీచర్ అనుకొనేసరికి నోరు మరీ పిడచగట్టకపోయింది.

నోరెండక పోతూంటే అతని దృష్టి ఓ మూలకు తిరిగింది. అక్కడ అతని కంట పడిందొక కుండ. అది మంచినీళ్ళ కుండ.

"ఏరా! ఆ కుండను కడిగినారా?" అని రోజూ అడుగుతాడు తాను.

"కడిగినాము సార్!" ముక్తకంఠంతో ముప్పయి మూడు గొంతులు పలకతాయి.

"మంచినీళ్ళు తెచ్చారా?"

"తెచ్చినాం సార్!" గొంతులు కలిసి అదే స్థాయిలో పలకతాయి.

"అయితే ఆ కడిగిన కుండను తెచ్చిన మంచినీళ్ళను తలుచుకొంటే ఒడలు జలదరిస్తుంది. దోసెడు మంచినీళ్ళు ఆ కుండ మొగానకొట్టి దానిని అటుయిటు తిప్పితే అది కడిగినట్లు! ఏ ఇంట్లోనో వీలుగాకుండా పెరటి తొట్లోనో ఆ కుండను ముంచి నీళ్ళు తెస్తే- అప్పటికవి మంచి నీళ్ళు!

ఇక ఉన్నది ఒక్కగా నొక్క సత్తులోటా!

ఓ బుద్ధిమంతుడు కాస్త పైకెత్తి తాగాలని ప్రయత్నిస్తాడు. మరొక్కడు సత్తులోటాను సగానికి పైగా నోట్లో చొప్పించు కొంటాడు.

ఇంకొకడు తాగుతుంటే- సగం నోట్లోకి సగం మళ్ళీ కడవలోకే!

ఆ దృశ్యం కండ్లముందు మెదులుతుంటే- దప్పికతో అలానే చావచ్చునేమో కానీ ఆ నీళ్ళుమాత్రం ముట్టలేమనిపిస్తుంది.

శుచీ శుభ్రతను గురించి చెప్పినంత సేపు శ్రద్ధగా వింటారు. శ్రద్ధగా వింటున్నందుకు నిదర్శనంగా చేతులు కట్టుకుంటారు. చెప్పడం అయిన తరువాత చేతులు వదిలిపెడతారు. దాంతోపాటు విన్నదీ వదిలిపెడతారు.

అందుకే దేవరాజు సుందర రాజును పిలిచాడు. ఇంటికి వెళ్లి ఓ చెంబు మంచినీళ్లు తెమ్మన్నాడు. తానేమో ఆ కుర్చీలో అలానే చేరగిల పడ్డాడు. పిల్లవాళ్ళ గుసగుసలు చింతచెట్ల గాలి విసవిసలతో మేలమాడుతున్నాయి. చింతచెట్ల సందుల్లో నుండి పడుతున్న పొడఎండలో పూరి గుడిసె వెలవెలపోతూ ఉంది!– దేవరాజు మొగంతో పోటీ పడుతూ!

సుందరరాజు ఓపరుగున బయటపడ్డాడు. వెళ్ళిన పిల్లవాడికోసరం 'ఎప్పుడొస్తాడా?' అని దేవరాజు ఎదురుచూస్తూ కూర్చున్నాడు. పదినిమిషాలయినా జరిగీ జరగక ముందే– ఆ పిల్లవాడు ప్రత్యక్షమయ్యాడు. దేవరాజుకు పోతున్న ప్రాణం లేచివచ్చినట్లయింది. లేచి సరిగ్గా కుర్చీలో కూర్చున్నాడు. అయితే కంటపడిన దృశ్యంతో ఓ క్షణం కలవరపడ్డాడు!

ఆ పిల్లవాడు! వాడే సుందరరాజులు. దర్జాగా ముందు నడుస్తున్నాడు. వాడింటి సేద్యగాడు వాడి వెనుక నడుస్తున్నాడు. సేద్యగాని చేతిలో ఓ గుండుచెంబు. గుండుచెంబుపై ఓ లోటా బోర్లించి ఉంది. వింతగా చూశాడా దృశ్యాన్ని దేవరాజు!

సేద్యగాడికంటే ముందు సుందరరాజు దేవరాజు దగ్గరికి వచ్చాడు. సేద్యగాడివైపు తిరిగి నిలబడ్డాడు. సేద్యగాణ్ణి చూస్తూ "ఊఁ!" అంటూ మేజావైపు చేయిచాపాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. వాడు చేయి చాపటంలోనే దర్జా ఉంది. సేద్యగాడు వినయంగా వంగి గుండు చెంబును మేజామీద పెట్టి గౌరవ సూచకంగా ఒక్క అడుగు వెనక్కు జరిగి నిలబడుకొన్నాడు.

దేవరాజు బుర్ర గిర్రున తిరిగింది.

గుండుచెంబును అందుకొన్నాడు. గుటగుట గుక్క ఆర్చకుండా నాలుగు లోటాల నీళ్ళు పట్టించాడు. 'అబ్బ!' అంటూ తేలిగ్గా నిట్టూర్చాడు. గుండుచెంబుపై లోటా బోర్లించి మేజామీద పెట్టాడు. సేద్యగాడు ఆ చెంబును అందుకొన్నాడు. ఒక్క నమస్కారం పడేసి బిడి గడప దాటేవరకు అలానే వెనక్కు నడిచాడు– తన చెమట తాను తింటున్నా తాను తానుగా బ్రతకలేని మనిషి!

సుందరరాజులు ఏదో ఘనకార్యం సాధించినంత తృప్తితో ధీమాగా వెళ్ళి తన చోటులో కూర్చుంటున్నాడు. సేద్యగాడు కడపదాటేవరకు వెనక్కు నడిచి ఆ తరువాత ముందుకు నడుస్తున్నాడు. కూర్చుంటున్న సుందరరాజుల్ని వెడుతున్న సేద్యగాడిని మార్చి మార్చి చూశాడు దేవరాజులు!

కాసిని మంచినీళ్ళు తేవడానికి కుర్రవెధవకు కూలిమనిషి కావలసి వచ్చింది!

అవునుకదా మరి! సుందరరాజులంటే ఎవరు?– సాక్షాత్ ఆ గ్రామ సర్పంచ్ ముద్దుల కొడుకు. తాను? అప్టరాల్ ఓ సింగిల్ టీచర్! తనకు దప్పికయితే సర్పంచ్ కొడుకు నీళ్ళు మోసుకురావాలని ఎక్కడుంది?

అయినా ఎంత విచిత్రంగా మారిపోయిందీ కాలం? మారిన కాలంతోపాటు మారుతున్న మనస్తత్వాలను గురించి ఆలోచించేసరికి– మనస్సు ఈ కాలాన్ని దాటి వెనక్కు వెళ్ళి వెళ్ళి ఆ కాలంలో అడుగుపెట్టింది.

ఆ కాలంలో తానూ ఒక విద్యార్థి!... సుందర రాజుల్లాంటి విద్యార్థి!!

అప్పుడు తన వయస్సు కూడా దాదాపు సుందరరాజుల వయస్సంతే ఉంటుంది. ఆ వయస్సులో ఆ పల్లె కూటమిలో తాను. తనతో కలిసి తన కంటే పెద్దవాళ్ళు కొందరు. తన గ్రామం కూడా ఇలాంటి ఓ కుగ్రామమే! అయితే సహజసౌందర్యం వనగూడినపల్లె అది!

ఆ రోజుల్లో ఓ మోస్తరుగా ఎదిగిన రెండు పట్టణాలను కలిపే ఓ బాట అక్కడ ఓ అర్థవృత్తాకృతిని సంతరించుకొనింది. తెలివిగల మానవుడు... ఆరు నూరయినా అవకాశాన్ని విడిచిపెట్టని ఆలోచనాపరుడు... ఆ అర్థ వృత్తాకృతిలో కాస్త మట్టిని తీసి ఆ బాట కిటువైపు, అటువైపు పోస్తే- అది మంచినీళ్ళ గుంట అయింది. ఆ కొలనులో కలువలు తామరలు- తమలో తాము పోటీపడుతుంటాయి- ఆ కొలను అందాన్ని పెంచడానకి!

ఆ కట్టకిందనే ఊరు. జక్కదనం దాని పేరు. ఆ జక్కదనం చాలా చక్కదనంగా ఉండేది!

ఆ ఊరిలో అన్నీ కలిపితే పాతిక ఇండ్లకు లోపు. అయినా అందులో ముప్పాతికవంతు మిద్దెయిండ్లు... ఇంటింటిని చుట్టి అధమపక్షం అరఫర్లాంగు దూరం ప్రహరీగోడ.... ఊరికి ఉత్తరంగా రామాలయం... రామాలయం ప్రక్కనే వీధిబడి.... ఆ బడిని అనుకొని పెద్ద చింతతోపు.... ఆ చింతతోపులో పెద్దబావి. ఒకనాటి మానవుని ప్రతిభావిశేషాన్ని చాటుతున్న నడబావి!

ఊరికి మధ్యగా ఓ మర్రివృక్షం. ఆ మర్రిచెట్టు బోదె చుట్టు రచ్చబండ. మర్రిచెట్టు నీడలో మరో చెట్టు ఎదగదంటారు. అయితే ఆ చెట్టునీడ అపాయకట్లో ఏ కుటుంబాన్ని కూడా కోర్టువరకు ఎదగనీయలేదు. కోర్టు కెక్కిన కొంప రతికెక్కదని బహుశా దానికి కూడా తెలుసునేమో?

దాదాపు పదిహేను గ్రామాలు ఆ గ్రామానికి కూతదవ్వులో ఉంటాయి. ఆ గ్రామాల కన్నింటికీ అది పాయకట్టు గ్రామం. ఈ పల్లెల్ని చుట్టుముట్టినట్టు చుట్టూ కొండలు వలయాకారంగా ఉంటాయి. ఆ వృత్తాకృతిలో ఈ పల్లెలు. వ్యవసాయమే ఈ పల్లెల్లో జీవనోపాధి. బావినీరే ఆధారం. అందువల్ల అక్కడి సేద్యం తొలికోడి కూసే వేళ నుండి పొద్దు తిరిగేదాక 'రాఁవో!' అన్న రాగాలతో ఆ ప్రాంతం మారుమోగుతూ ఉంటుంది. ఎద్దులగొట్టి ముద్దలు తినడమయినా- అక్కడి జీవితం క్రమబద్ధం.

ఆ పల్లెల్లో అంతో యింతో వెసులుబాటున్న వాళ్ళు తమ పిల్లల్ని జక్కదనంలోని వీధిబడికి పంపేవాళ్ళు.

ముప్పయి ఏండ్లకు ముందుమాట. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులు. అసలు స్వాతంత్ర్యమంటే ఏమిటో ఆ పల్లెలకు తెలియదు. ఇప్పటిలాగ ఊరికొక్క బడి అప్పట్లో లేవు. చదువు చెప్పినా చెప్పకపోయినా బడికి వెళ్ళితే చాలు! నెలపుడుతూనే జీతం చేతికరదే రోజులు కావవి. బిడ్డల్ని చదివించాలని శ్రద్ధ ఉన్నవాళ్ళు... చదువు విలువ అంతో యింతో

తెలిసినవాళ్ళు- ఓ బడి పెట్టి ఆ బడిలో అయ్యవారిని నియమించేవాళ్ళు. అయ్యవారికి ఏలోటూ రాకుండా చూసు కోవడం పల్లీయులకు పిల్లలకు బాగా చదువు చెప్పడం అయ్యవారికి బాధ్యతలుగా ఉండేవి. అయితే ప్రతిఫలం ఇస్తున్నామనీ పల్లీయులకు కానీ, ఏదో చదువు చెప్పాలని చెబుతున్న అభిప్రాయం అయ్యవారికి కానీ- ఉండేవి కావు. 'అయ్యవారు' గ్రామస్థుల మధ్య ఆత్మీయతల్ని నిర్వచించడం మహా కష్టం. ప్రతిఫలం అన్న మాటకు అతీతంగా ఉండేది వ్యవహారం!

చెరకు గానుగులు ఆడుతుంటారు. "నువ్వు ఒక ముద్దేనా? నేను రెండు ముద్దలు!" అని పోటీపడితెస్తారు పిల్లలు. రొట్టెవాడి కంటె ముక్కలవాడి పనే నయమన్నట్లు ఆ ఏడాది అయ్యవారింట్లో- బెల్లానికి లోటుండదు. ఏ కాలాని కా పంట! ఏయే పంట కాలానికి అయ్యవారింట్లో ఆ యా పంట!

అప్పట్లో వీధిబడిలో చదువు చెప్పింది అప్పావుపిళ్ళ.

కన్నుకాస్త మెల్లఅయినా ఆయన రూపం ఇంకా కన్నులకు కట్టినట్లుగానే ఉంది.

ముచ్చటగా మూడు విభూతిపట్టెలు... మధ్యగా దమ్మిడంత గంధం బొట్టు... అరవ అడ్డపంచెకట్టు... అర చొక్కామీద ఏ నాటిదో పాత కోటు... రెడీమేడ్ తలపాగా! చేతికి చింతబరికె అందుకొంటే బడి గడగడ లాడేది.

అయినా అయ్యవారికి పిల్లలకు మధ్య ఎంత ఆత్మీయత?

ఆనాటి తలపుల్లో తేలిపోతున్నాడు దేవరాజు. అయితే అయ్యవారి లోకంలో అయ్యవారు ఉంటే పిల్లల రంపు పిల్లలదయింది. ఆ రంపుతో ఈ లోకంలో పడ్డాడు దేవరాజు.

ఆ రంపుతో తన అనుభూతి చెడిపోయినందుకు ఆ వేశపడ్డాడు దేవరాజు. బెత్తం చేతి కందుకున్నాడు. 'సైలెన్స్' అని అరుస్తూ, చేతి బెత్తంతో శక్తి కొలదీ కొట్టాడు- మేజామీద!- ఎటూ పిల్లల్ని కొట్టలేడు కాబట్టి!

గతాన్ని నెమరవేయడంలో ఆనందం ఉంది. ఆనందంలో అనుభూతి, అదే అనుభవిస్తున్నాడు దేవరాజు. అయితే పిల్లల రంపుతో ఆ అనుభూతికి అంతరాయం కలిగింది. అంతరాయం తొలగాలంటే అల్లరి తగ్గాలి. అల్లరి తగ్గాలంటే పిల్లలకేదో పనిపెట్టాలి. అందుకే సుద్దముక్కను చేతి కందుకొన్నాడు. నల్లబల్లను సమీపించాడు.

చిన్న కాపురానికయితే పెద్దది... పెద్దకాపురానికయతే చిన్నది- అనిపించగల సంకటి పలకంత ఉంటుందా నల్లబల్ల. అదిగూడ అప్పుడప్పుడు మాయమవుతుంటుంది. ఆ ఊళ్ళో పొట్టేలినో, మేకపోతునో కోస్తే పాళ్ళు వేయడానికి పలక అవసరం ఉంటుంది. ఈ పలక ఆ పలకగా మారుతుంది. అయితే అదృష్టవశాత్తు ఆ రోజు అలాంటి అవసరం రాలేదు కాబట్టి ఆ పలక నల్లబల్లగా మిగిలింది.

ఆ నల్లబల్లను అయిదు భాగాలుగా విభజించాడు దేవరాజు. ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క భాగం. మిద్దింటి లక్ష్మమ్మ అక్కడ ఉంటే కసిదీరా అడగాలనిపించింది. ఆ పలకను చూపించి- 'ఇంతమందికి ఈ ఒక్క పలకతో నా చావెట్లా చావమంటావు?' అని.

ఆ ఊళ్ళో తాను అడుగు పెట్టింది మొదలు- ఎంతో మందితో ఎన్నెన్నో చెప్పాడు. మరెన్నో అడిగాడు. విన్న నాథుడు లేడు. ఇదిలా అన్న యోగ్యుడూ లేడు. సరిపెట్టుకోవడంలో సాధ్యుడయ్యాడు దేవరాజు. అందుకే ఒక తరగతికి లెక్కలు... మరొక తరగతికి పద్యాలు... ఇంకొక్క తరగతికి పదాలు- ఇలా తరగతి కొక్కపని కల్పించాడు. కల్పించిన పనిని చేయమన్నాడు పిల్లల్ని!

పిల్లలందరూ పలకలందుకొన్నారు. ఒకడు నీళ్ళు పోసి పలకను కడుగుతున్నాడు. మరొక్కడు అటుఇటు చూసి అంత ఎంగిలి రుద్దుతున్నాడు. ఇంకొకడు జేబులో భద్రపరచుకొన్న బలపాకు పిండి రసం తీస్తున్నాడు. నవ్వుకొంటూ దేవరాజు కుర్చీలో కూలబడ్డాడు.

"సార్!"

పిలుపు వినిపించిన వైపు తిరిగాడు దేవరాజు.

ఓ కుర్రవాడు నిలబడి ఉన్నాడు.

"ఏరా?"

వాడు నోరు తెరవకుండా! కుడిచేతి చూపుడు వేలిని వంచి చూపాడు.

"వచ్చి పదినిముషాలయినా కాలేదు. అప్పుడే ఒంటికి బయటికి. చదువుకోమంటే చాలు- సవాలక్ష సాకులు!" అని గొణుక్కొంటూ 'పోరా!' అన్నాడు.

ఆ మాట చెవిని పడడంతో ఆ కుర్రవాడు అక్కడికక్కడే నిక్కరు గుండీ మీద చేతులుపెట్టి పరుగందుకొన్నాడు. అలా పరుగెత్తుతున్న కుర్రాడ్ని చూస్తూ తనలో తాను నవ్వుకొన్నాడు దేవరాజు!

అప్పుడు తనకూ అదే వయస్సు!

అప్పావుపిళ్ళ అయ్యవారి ముందు లేచి నిలబడి ఎడమచేతిని వెనక్కు పెట్టి కుడిచేతిని మూతివరకు పైకెత్తి చూపుడు వేలిని కాస్త వంచితే చాలు!- 'చిన్నోడా!' అని ఆప్యాయంగా పిలుస్తూ ఎడమచేతిని పైకెత్తి అన్ని వేళ్ళూ ముడిచి చూపుడు వేలిని మాత్రం చూపేవాడు అప్పావుపిళ్ళ. అలా చూపుతూ ఆదోరకంగా నవ్వేవాడు. గుబురుమీసాల సందుల నుండి ఆ నవ్వు అందచేసే కబురు తనకు అయ్యవారికి మాత్రమే తెలుసు! అంతే!- ఒక్క పరుగులో గుంటకట్టమీద తాను వాలేవాడు!

గుంటకట్టమీద వెలగచెట్టు. వెలగచెట్టు కింద ఓ పూరిగుడిసె. ఆ గుడిసెలో 'అంగిడవ్వ!'- అంగిడవ్వ వడలు మురుకులు కాలుస్తుంది. దోసెలు పోస్తుంది. బీడీలు సిగరెట్లు ఆకు వక్కా పొగాకు అమ్ముతుంది. ఆ బాటమీద వచ్చేపొయ్యేవాళ్ళ నోటికంత ఆకు వక్క కావాలన్నా ఆ

చుట్టు పక్క పల్లెల్లో పిల్లలచేతికి ఒక వడో మురుకో ఇవ్వాలనుకొన్నా 'అంగిడవ్వ' అంగడికి రావాల్సిందే!

అవ్వ ముందు నిలబడితేచాలు. "ఏఁవిరా!మనవడా? వచ్చేస్తివా!" అని బోసి నోటితో నవ్వుతూ ఓ మురుకో లేదా వడో చేతిలో పెడుతుంది. అక్కడితో పూర్తి కాదు పని. అవ్వతో ఆమాటా ఈమాటా మాట్లాడాలి. ఆమె కేదయినా కావలసి వస్తే అందిస్తూ సాయపడినట్లు నటించాలి. అవ్వ ఏమరుపాటును ఎదురుచూడాలి. సందు దొరికితే చాలు!– అంత పొగాకు కాడ తుంచుకొని పరుగో పరుగు.

గసపోసుకొంటూ వెళ్ళి అయ్యవారి పక్కన నిలబడినట్లు నిలబడి ఎవరి కంటా పడకుండా ఆ పొగాకు కాడను అయ్యవారి చేతిలో పెడితే ఆ పిచ్చిమారాజు ఎంత సంతోషించే వాడో?– పొగాకు కాడ నోట్లో వేసుకొని తన్మయత్వంతో నములుతూ పాఠాలు చెబుతూంటే తనకెంత సంతృప్తి కలిగేదో?

గత స్మృతి దేవరాజు ఆనందానికి శ్రుతి కలుపుతూ ఉంది!

ఒకటి రెండు రోజులు ఆదవిడుపు వస్తేచాలు! బిడి బిడిగా 'పోలో'మని కదిలి నట్లుండేది గూటంకొండకు. 'బుడంకాయం బుల్లోళ్ళు– మీరు గూటం కొండ ఎక్కడం అటుంచి అంత దూరం నడవలేరురా!' అని అయ్యవారు వారిస్తున్నా వినకుండా గూటం కొండకు పరుగులు తీసేవాళ్ళు పిల్లలు. ఆ పల్లెల్ని చుట్టివున్న కొండల్లో ఎండిన కట్టెలాంటి ఆకారాల మధ్య ఓ ఒళ్ళు బలిసిన మనిషి నిలబడి నట్లుండేది గూటం కొండ. ఆ కొండలో బిక్కి బీర ఉలింజ పరిగ రేగుపండ్లు చెట్లు విరగకాసినట్లుండేవి. బయలుదేరేదేమో పండ్లకోసమని!– తీరా అక్కడికి వెళ్ళిన తరువాత పండ్లమీది కంటే ఎండు కట్టెలమీద చూపు పంతాలు పడేది. పోటీలు పడ్తూ ఎండుకట్టెలు ఏరుకొనేవాళ్ళు పిల్లలు. 'నీమోపుకంటే నా మోపు పెద్దది. మనిద్దరి మోపుకంటే వాడి మోపు చిన్నది!' అని పంతాలు పడుతూ తలకు మించిన బరువును మోపుగా కట్టుకొనేవాళ్ళు. ఉచ్చి పీకుతున్నా లెక్క పెట్టకుండా దాదాపు రెండు మూడు మైళ్ళు చెప్పులు లేని బుల్లి పాదాలకు చైతన్యమొస్తే ఆ కట్టెల్ని మోసుకొని వచ్చి అయ్యవారింట్లో కుప్ప వేస్తే– అదెంతెత్తు కుప్పయ్యేది? ఆ కుప్పను చూస్తూ 'అయ్యోరికింక నెల్నాళ్ళు బాదే లేదురా!' అని అనుకొనే సరికి ఆ చిన్ని గుండెలు ఆనందంతో గూటం కొండంత అయ్యేవి!

ఇంట్లో పొద్దస్తమానం పొలం పనుల్లో అలిసి సొలిసి వచ్చిన ఎద్దుల్ని చూపించి 'ఒరే! సిన్నోడా! ఆ ఎద్దుల మొకానంత తవుడు కలిపి కొట్టారా?' అని రాత్రిపూట పాలుమారి అమ్మో నాయనో చెప్తే చాలు! ఊరు చూడమంటే ఉత్తరం చూసేది మూతి! అలాంటి మనస్తత్వం అయ్యవారింటి పనంటే ఎగిరి గంతులేసేది. ఎందుకో ఆ ఆత్మీయత?

రామాలయానికి వెనుక ఓ తోట ఉండేది. స్వామి పూజకు ఆ తోటలో ఒకప్పుడు రక రకాల పూలు పూచేవి. ఊళ్ళో వాళ్ళకు పొత్తులుపోకుండా ఆ తోట ఒక చీకటిపొదలా తయారయింది. ఆ తోటను 'భజనతోట' అనేవాళ్ళు. ఆ తోటమీద పడింది అయ్యవారి చూపు.

'తోటపని' పేరుతో ఆ తోట కూరగాయల తోటగా మారింది. పెద్దబావి నుండి కావిళ్ళు గట్టి నీళ్ళు మోసేవాళ్ళు పిల్లలు. అలాగే అయ్యవారింటికి కూరగాయలూ మోసేవాళ్ళు.

అంతేనా? గంగమ్మ జాతరలు... సంక్రాంతి... దసరాపండుగలు వస్తేచాలు. వేషాలు వేసుకొని పిల్లలు తొక్కని గుమ్మం లేదంటూ తిరిగేవాళ్ళు. కోటికి పడగెత్తక పోయినా కొదవలేని గుండెలు ఆకాలం మనుషులకు. చాటతో ముంచితెస్తే పొర్లిపోతుండేది ధాన్యం. ఆ ధాన్యం ఎంత లేదన్నా మూడు, నాలుగు మూటలయ్యేది. ఆ ధాన్యాన్ని మోసుకొనిపోయి అయ్యగారింటి నట్టింట్లో పోసినపుడు ' అయ్యోరమ్మ' ఆ ధాన్యాన్ని కడవలకెత్తి దొంతర్లు పెడుతుంటే- పట్టపగ్గాలుండేది కాదు ఆనందానికి.

ఆరోజులు ఆరోజులే!- ఆరోజులిక రావు!!

ఈరోజుల్లోనా?- "గుక్కడు మంచినీళ్ళు గొంతులో పోయరా!" అంటే ఆ మంచినీళ్ళు తేవడానికి ఒక మనిషి అవసరమయింది.

ఎంత విచిత్రంగా మారిపోయారీ కాలం పిల్లలు?

దేవరాజు మారిన పిల్లల మనస్తత్వాల్ని గురించి ఇంతవరకు ఆలోచించాడు. అయితే అతని ఆలోచనలు అతనికే ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. తాను ఇంతసేపు ఆలోచించింది ఒకవైపే!- అంటే పిల్లల్ని గురించి. మరి ఉపాధ్యాయుల్ని గురించి!

ఉపాధ్యాయుల్లో మాత్రం విద్యార్థుల మీద ఆనాడుండిన ఆత్మీయత అనురాగం అనుబంధం ఈనాడున్నాయా? ఈ ఆత్మీయతానురాగాలు ఉపాధ్యాయునికి విద్యార్థికీ మధ్య సేతువులని కనీసం ఆలోచించగలుగుతున్నారా? బడికి రావాలి కాబట్టి వస్తున్నారు. రాకపోతే జీతాలు రావు. జీతాలు రాకపోతే పూట గడవదు. కాబట్టి వస్తున్నారు. వచ్చి చెబుతున్నారు- తమకు తోచినంతవరకు లేదా, తెలిసినంతమట్టుకు!! వినినవాడు వింటున్నాడు. లేనివాడు లేదు. పట్టించుకొనే నాధుడెవడు?

కానీ ఆనాటి ఉపాధ్యాయుడు!

ఆ మాట తలుచుకొంటే శరీరం గగుర్పొడిచింది దేవరాజుకు!

ఆ దృశ్యం ఇంకను కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూనే ఉంది.

ఓ వేసవి కాలంనాటి రాత్రి. ఉక్కపోస్తూ ఉంటుంది కాబట్టి- ఊరు ఊరంతా ఇండ్ల ముందు వాకిళ్ళల్లో వరుసగా మంచాలు వేసుకొని పడుకొంటారు. అప్పావుపిళ్ళ కుటుంబం కూడా అలాగే పడుకొనింది. అయ్యవారి మంచి హృదయంలాంటి పండు వెన్నెల... పుచ్చపూసినట్లు పిచ్చిగా నవ్వుతూ ఉంది. ఎక్కడ నుండి వచ్చిందో మాయదారి పాము. ఎవరి కంట పడకుండా ఎలా కరిచిందో అయ్యవారి కొడుకును! నిద్రలేచేసరికి- అయ్యగారి ఒక్కగా నొక్క కొడుకు- పడుకొన్నవాడు పడుకొన్నట్లే ఉన్నాడు. అయితే శవమై!

ఊరూ నాడూ ఏకమయింది. కంటికి కడవడు కన్నీరు కార్చింది.

"అందుకే ఒక కన్ను కన్నుగాదు. ఒక కొడుకు కొడుకు కాదన్నారు పెద్దోళ్ళు! పాపం అప్పావుపిళ్ళయ్యోరు ఇంక పైకి లెయ్యలేదురా?" అన్నారు ఊళ్ళోవాళ్ళు.

అయితే దహన సంస్కారం చేసి ఆ మధ్యాహ్నమే బడికి వచ్చాడు అప్పావుపిళ్ళ. అయ్యవార్ని చూసి గొల్లుమన్నారు పిల్లలందరు!

మహావేదాంతిలా నవ్వాడు అయ్యవారు!

"ఒరే! అబ్బాయిలూ! చచ్చిపొయ్యింది ఒక్క కొడుకే గదరా! – మరి మీరంతా బిడ్డలు కారా? ఇంత మంది బిడ్డలుంటే నా కెందుకురా బెంగ!"

ఆ మాటతో కుమిలి కుమిలి ఏడ్చారు పిల్లలు! పిల్లల్ని చూస్తూ అయ్యవారు, అయ్యవార్ని చూస్తూ పిల్లలు!! – కాకిశోకంగా తయారయింది.

ఏమైపోయారో అలాంటి ఉపాధ్యాయులు?

సమాధానం దొరకని ప్రశ్నతో దేవరాజు సతమతమవుతున్నాడు.

అవును. ఆనాటి ఉపాధ్యాయులు వెలిగే దీపాలు! తాము వెలుగుతూనే ఎన్నో దీపాల్ని వెలిగించారు. అలా వెలిగినదీపాల్ని చూస్తూ "ఇవి నేను వెలిగించిన దీపాలు! నేను వెలిగించిన దీపాలు!" అని రొమ్ము విరుచుకొని నిలబడ్డారు!

కానీ ఈనాటి ఉపాధ్యాయులు ఎంత ప్రయత్నించి వెలిగించాలనుకొన్నా వెలగని దీపాలమధ్య తామూ వెలగని దీపాలు!

దేవరాజు గుండెల్లో నుండి భారంగా వెలువడిన నిట్టూర్పు ఆ పూరింటి పై కప్పు సందుల్లో నుండి బయటపడి చింతచెట్ల కొమ్మలమీద అరుస్తున్న కాకిగోలతో కలిసిపోయింది! ●

ఆంధ్రపత్రిక
(ఉగాది ప్రత్యేక సంచిక, 1980)